6_6.qxd 3/6/2026 11:58 PM Page 1



# విద్య ద్వారానే ఆర్థిక, స్వాతంత్ర్యం

**- దేశ ఆర్థిక అభివృద్ధిలో మహిళల బాధ్యత కీలకం - ఎంపీడీవో**




**బల్లికురవ, మార్చి 6, ప్రభాతవార్త**
గ్రామీణ ప్రాంతాలలో మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించడం దేశ ఆర్థిక అభివృద్ధికి ఎంతగానో దోహదం చేస్తుందని ఎంపీడీవో కుసుమకుమారి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకల సన్నాహక కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళ శిశు సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు నెల 2 నుండి 20వ తేదీ వరకు ప్రత్యేక కార్యచరణ విడుదల చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి సంతమాగులూరు సీడీపీవో సుధా అధ్యక్షత వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో, కుసుమకుమారి మాట్లాడుతూ అక్షరం నేర్చుకోవడం ద్వారానే బాలికలు తమ కాళ్ళపై తాము నిలబడి, ఆత్మవిశ్వాసంతో నిర్ణయాలు తీసుకోగలుగుతారు అన్నారు. విద్యను అభ్యసించిన మహిళలు తమ కుటుంబ ఆరోగ్య పరిరక్షణ, ఆర్థిక క్రమశిక్షణ పాటించడం ద్వారా గ్రామీణ కుటుంబ వ్యవస్థ ఆర్థికంగా మరింత పురోభివృద్ధి చెందుతుందన్నారు. తల్లిదండ్రులు బాలికా విద్యను ప్రోత్సహించడం ద్వారా రేపటి తరం ఉత్తమ సమాజాన్ని నిర్మిస్తుంది అన్నారు. సీడీపీవో సుధా మాట్లాడుతూ ప్రధానమంత్రి మాతృ వందన కార్యక్రమాన్ని అందరికి అర్థమయ్యే రీతిలో వివరించారు. వైద్యాధికారి రవితేజ మాట్లాడుతూ ప్రధానమంత్రి మాతృ వందనం పథకం ద్వారా తొలిసారిగా గర్భం దాల్చిన వారికి కాన్పుకు 5000, రెండవ సారి ఆడ శిశువు జన్మిస్తే రూ.6000 ఒకే సారి వారి ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. ఈ ఆర్థిక సహాయంతోగర్భవతులు పోషణ ఆహారాన్ని సరైన సమయంలో తీసుకోవడం ద్వారా, సరైన సమయంలో వైద్యశాలలోనే బిడ్డను జన్మించే విధంగా ప్రోత్సాహం అందజేసినట్టు అవుతుందన్నారు. ఈ సందర్భంగా స్థానిక ఉన్నత పాఠశాల నుండి అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, పాఠశాల విద్యార్థులతో ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో కుసుమకుమారిని, పలు అధికారులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి రమేష్‌బాబు, కస్తూరిబా ప్రిన్సిపాల్ సరళకుమారి, ఎంవీ ఫౌండేషన్ ప్రతినిధి హరిహరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# పలు శుభ కార్యక్రమాలకు హాజరైన కరణం




**బల్లికురవ, మార్చి 6 ,ప్రభాతవార్త**
మండలంలోని కొమ్మినేనివారి పాలెం గ్రామంలో శుక్రవారం జరిగిన పలు శుభ కార్యక్రమాలకు చీరాల వైకాపా ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌బాబు హాజరయ్యారు. గ్రామానికి చెందిన మక్కెన రోశయ్య, సామ్రాజ్యంల కుమారుడు వినోద్‌కుమార్, శివనాగ మౌనికల వివాహం శుక్రవారం రాత్రి జరగనుంది. ఈ సందర్భంగా కాబోయే నూతన వరుడుని ఆశీర్వదించి వివాహ మహోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం పూరేటి వీరాంజనేయులు, పుష్పావతిల కుమారుడు బ్రహ్మతేజ, అఖిల సుష్మల వివాహం శనివారం జరగనుంది. ఈ సందర్భంగా బ్రహ్మతేజను ఆశీర్వదించి వివాహ మహోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమాల్లో మండల వైకాపా కన్వీనర్ దేవినేని కృష్ణబాబు, కూకట్‌పల్లి సర్పంచ్ ఇప్పల అయ్యప్ప రెడ్డి, సహకార సంఘం మాజీ అధ్యక్షులు దర్శి రామకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మీనారాయణకు కరణం పరామర్శ



**బల్లికురవ, మార్చి 6, ప్రభాతవార్త**
మండలంలోని కొమ్మినేనివారిపాలెం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న ఏల్చూరి లక్ష్మీనారాయణను శుక్రవారం చీరాల వైకాపా ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌బాబు పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యుల ద్వారా తెలుసుకున్నారు. లక్ష్మీ నారాయణకు ధైర్యం చెప్పి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన వెంట స్థానిక నేతలు ఉన్నారు.

# నూతన వధూవరులకు కరణం ఆశీర్వాదం





**బల్లికురవ, మార్చి 6, ప్రభాతవార్త**
హైదరాబాద్‌లోని నీవా కన్వెన్షన్ వివాహ మందిరంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ మాజీ డీపీజీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి, గీత ల కుమారుడు అఖిలేష్‌రెడ్డి, స్నేహజ ల వివాహ వేడుక జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన మాజీ పార్లమెంట్ సభ్యులు కరణం కృష్ణమూర్తి నూతన వధూవరులు అఖిలేష్‌రెడ్డి, స్నేహలను ఆశీర్వదించి వివాహ మహోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా తెలంగాణకు చెందిన పలువరు కాంగ్రెస్, టీఆర్ఎస్ నేతలు కరణం బలరాంతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. తాజా పరిణామాలపై ప్రత్యేక చర్చలు కొనసాగినట్లు తెలిసింది. ఆయనను ఆత్మీయంగా ఆహ్వానించి అక్కువ చేర్చుకున్నారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజాదర్బార్



**యర్రగొండపాలెం, మార్చి 6 ,ప్రభాతవార్త**
యర్రగొండపాలెం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ బాధ్యులు ఎరిక్షన్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పార్టీ కార్యాలయంలో జరిగిన ప్రజా దర్బార్ కు యర్రగొండపాలెం మండల నాయకులు ఆ పార్టీకి చెందిన ముఖ్య శ్రేణులు పాల్గొన్నారు. మండలంలోని పలు గ్రామాల సమస్యలను ఆ గ్రామ నాయకులు అర్జీల రూపంలో సమర్పించారు. యర్రగొండపాలెం పట్టణంలోని ముస్లింలకు చెందిన పలు సమస్యలను ఆ పార్టీకి చెందిన మైనార్టీ ముస్లిం నాయకులు, ముస్లిం యూత్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ షేక్ ఇస్మాయిల్ ఎరిక్షన్‌బాబు దృష్టికి అర్జీల రూపంలో అందించారు. అదే విధంగా పేద ముస్లింలకు చెందిన ముఖ్యమంత్రి సహాయనిధికి అర్హులై ఉండి ముఖ్యమంత్రి సహాయనిధి అందుకోని పలువురి పెండింగ్ ఫైళ్ళను ఎరిక్షన్‌బాబు దృష్టికి తెచ్చారు. వాటిని పరిశీలించిన నాయకుడు వెంటనే పరిష్కరించి ముఖ్యమంత్రి సహాయనిధి అందే విధంగా చూద్దాం అనే హామీని ఇచ్చారు. గత వారంలో జరిగిన ప్రజా దర్బార్‌లో ముస్లిం మత పెద్దలు అడిగిందే తడవు ముస్లింల ఈద్గా దగ్గరి ఖబరస్థాన్‌కు 10 లక్షలతో రహదారి మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వెంగల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు పెరుమాళ్ళ మల్లిఖార్జున, ముస్లిం నాయకులు షేక్ మస్తాన్ వలి, షేక్ సత్తార్, పేరం రమణారెడ్డి, కొప్పర్తి వెంకటరెడ్డి, మాగులూరి వెంకటేశ్వర్లు, కేశనపల్లి మల్లిఖార్జున తదితరులు పాల్గొన్నారు.

## మోట్ల మల్లిఖార్జునపురం వద్ద కారు మోటార్ సైకిల్ ఢీ .. ఒకరు మృతి



**పెద్దదోర్నాల, మార్చి 6, ప్రభాతవార్త**
పెద్దదోర్నాల మండలం మోట్ల మల్లిఖార్జునపురం సమీపంలో మోటార్ సైకిల్‌ను గుర్తు తెలియని కారు ఢీకొనడంతో మోటారు సైకిల్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన శుక్రవారం జరిగింది. ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో డోన్ సమీపంలోని రాచర్ల గ్రామానికి చెందిన బెస్త శరత్(25) అక్కడికక్కడే మృతి చెందాడు. అతనితో పాటు ఉన్న నూనె దేవేంద్ర స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. మాచర్ల నుండి డోన్‌లో జరిగే రంగనాథ స్వామి జాతరకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. ఘటన స్థలానికి చేరుకున్న పెద్ద దోర్నాల ఎస్సై వెంకట రమణయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# నేడు తిరుపతమ్మ తల్లి 25వ వార్షిక తిరుణాల మహోత్సవం



**బల్లికురవ, మార్చి 6, ప్రభాతవార్త**
బల్లికురవ, సంతమాగులూరు రహదారిలో పట్టేపురం గ్రామ సమీపంలో వేంచేసియున్న శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ తల్లి, ఆలయం 25వ వార్షిక తిరుణాల మహోత్సవం శనివారం జరగనుంది.ఉమ్మడి గుంటూరు, పల్నాడు, ప్రకాశం జిల్లాల నుండి తిరుపతమ్మ తల్లి భక్తులు ప్రతి ఏటా అధిక సంఖ్యలో వార్షికోత్సవ వేడుకకు తరలి వెళ్తుంటారు. పరిసర గ్రామాలలోని భక్తుల చేయూతతో ప్రత్యేకంగా విద్యుత్ ప్రభను ఏర్పాటు చేయటంతో పాటు, ఉదయం నుండి తెల్లవారుజాము వరకు అన్నదాన కార్యక్రమాలు, తిరుపతమ్మ తల్లి కథ శ్రవణం, బృందావన భజన, కోలాటం తదితర సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగనున్నాయి. ఆలయ పర్యవేక్షకురాలు సీతమ్మ ప్రతి శుక్రవారం అమ్మవారి భక్తులకు కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా స్వామివారి మాటను భక్తులకు తెలియజేస్తుంటారు. బల్లికురవకు చెందిన బొంత వీరయ్య అమ్మవారి శాశ్వత వాలంటీరుగా తన సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూ, వార్షికోత్సవ వేడుకలు విజయవంతం అయ్యేందుకు చేయూతనిస్తూ ఉంటాడు.

## ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను కలిసిన మంత్రి గొట్టిపాటి



**బల్లికురవ, మార్చి 6, ప్రభాతవార్త**
అద్దంకి నియోజకవర్గాన్ని అభివృద్ధికి చిరునామాగా మార్చే క్రమంలో మరింతగా నిధుల వరద పారించేందుకు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తనదైన శైలిలో ముందుకు పోతున్నారు. ఈ క్రమంలో భాగంగా శుక్రవారం అద్దంకి నియోజకవర్గ అభివృద్ధి అంశాలపై ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి పవన్ కళ్యాణ్‌ను కలిశారు.ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పంచాయతీ రాజ్ శాఖకు సంబంధించిన అభివృద్ధి పనులపై వివరంగా చర్చించారు.ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, తాగునీరు వంటి మౌలిక వసతుల మెరుగుదలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. అద్దంకి నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తామని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సానుకూలంగా స్పందించారు.

# పల్లె రహదారులకు కొత్త రూపు

**- ఏళ్ల తరబడి సమస్యలకు శాశ్వత పరిష్కారం - అంతర్గత రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి ప్రాధాన్యం**

**- రూ.45.82 కోట్లతో 396 అభివృద్ధి పనులు - ఊపు అందుకున్న పల్లెల ప్రగతి**

**- అభివృద్ధి సారథి ఎమ్మెల్యే సాంబన్న**



**మార్టూరు, మార్చి 6, ప్రభాతవార్త**
పర్చూరు నియోజకవర్గంలోని పల్లెలకు కొత్త రూపు దిద్దేలా అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఏళ్ల తరబడి ప్రజలను ఇబ్బంది పెట్టిన రహదారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించే దిశగా చర్యలు చేపడుతున్నారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు(సాంబన్న) ప్రత్యేక చొరవతో గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించడంతో పల్లెల్లో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. గత ప్రభుత్వ కాలంలో గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి నిర్లక్ష్యానికి గురై రహదారులు దెబ్బతినడం, సరైన డ్రైనేజీ వ్యవస్థలేకపోవడం వంటి సమస్యలు ఎక్కువయ్యాయి. ముఖ్యంగా వర్షాకాలంలో రోడ్లపై నీరు నిల్వ ఉండడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే సాంబన్న గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

### మౌలిక వసతులకు పెద్దపీట :



నియోజకవర్గ వ్యాప్తంగా 396 అభివృద్ధి పనులకు 45.82 కోట్ల కేటాయించి సీఈ రోడ్లు, సైడు డ్రైన్ల నిర్మాణ పనులు చేపట్టారు. పలు గ్రామాల్లో ఇప్పటికే పనులు ప్రారంభమై వేగంగా కొనసాగుతున్నాయి. ఈ పనులు పూర్తయితే గ్రామాల్లో రవాణా సౌకర్యం మెరుగుపడటంతో పాటు వర్షాకాలంలో నీరు నిల్వ ఉండే సమస్యలు కూడా తగ్గే అవకాశం ఉందని స్థానికులు భావిస్తున్నారు.

### గ్రామాల్లో మార్పు స్పష్టంగా :

అభివృద్ధి పనులు ముమ్మరంగా కొనసాగుతుండడంతో పల్లెల్లో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. గతంలో నిర్లక్ష్యానికి గురైన గ్రామాలు ఇప్పుడు అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. రహదారులు, డ్రైనేజీ వ్యవస్థలు మెరుగుపడితే గ్రామాల్లో జీవన ప్రమాణాలు కూడా పెరుగుతాయని వారు అంటున్నారు. గ్రామాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే సాంబన్న తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించడం ద్వారా పల్లెలను అభివృద్ధి దిశగా తీసుకెళ్లడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

### మండలాల వారీగా పనులు :

నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో అభివృద్ధి పనులు జోరుగా కొనసాగుతున్నాయి. మార్టూరు మండలం 61 పనులు రూ.8.88 కోట్లు, యద్దనపూడి మండలం 62 పనులు రూ.5.87 కోట్లు, పర్చూరు మండలం 94 పనులు రూ.11.75 కోట్లు, కారంచేడు మండలం 46 పనులు రూ.5.24 కోట్లు, ఇంకొల్లు మండలం 83 పనులు రూ.6.49 కోట్లు, చిన్నగంజాం మండలం 50 పనులు రూ.7.58 కోట్లు.

# పాఠశాల విద్యార్థులకు అల్పాహారం వితరణ




**హనుమంతునిపాడు, మార్చి 6, ప్రభాతవార్త**
హనుమంతునిపాడు మండలం పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మహమ్మదాపురం నందు శ్రీ సత్య సాయి సేవా సంస్థ వారు పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీ సత్య సాయి సేవా సంస్థ సభ్యులు మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు పది రోజుల పాటు అల్పాహారం అందజేయడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణను అలవర్చుకొని నైతిక విలువలను పెంపొందించుకోవాలని, ఉన్నత మార్గంలో ప్రయాణించాలని ఉపదేశించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాధాకృష్ణ విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకుని చక్కగా చదువుకొని, పదవ తరగతి పరీక్షలలో ఉన్నత ఫలితాలను సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సత్య సాయి సేవా సంస్థ సభ్యులు ఈర్ల వెంకటేశ్వర్లు, బిక్షం, వెంకటరెడ్డి, సతీష్ కుమార్, సురేష్‌బాబు, సత్యనారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ఆర్‌పాలెంలో వైసీపీ కమిటీల ప్రక్రియ పూర్తి



**లింగసముద్రం, మార్చి 6, ప్రభాతవార్త**
లింగసముద్రం మండలంలోని ఆర్ఆర్‌పాలెం పంచాయతీలో గ్రామ కమిటీలను పూర్తి చేసి శుక్రవారం కందుకూరు పార్టీ కార్యాలయంలో మాజీ శాసనసభ్యులు,కందుకూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్‌యాదవ్‌కి ఆర్ఆర్‌పాలెం వైసీపీ నాయకులు, కార్యకర్తలు అందజేశారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రాబోయే రోజుల్లో ఇంకా ఉత్సాహంతో పని చేయాలని సూచించారు. అలాగే పని చేసిన ప్రతి కార్యకర్తకు రాబోయే రోజుల్లో మంచి జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తహిసల్దార్‌ని కలిసిన మండల తెదేపా నేతలు



**కందుకూరు మార్చి 6, ప్రభాతవార్త**
కందుకూరు తహసిల్దార్ పి.మురళిని శుక్రవారం కందుకూరు మండల తెదేపా అధ్యక్షుడు బుస్సా రెడ్డి కృష్ణారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పలుగ్రామాల తెదేపానేతలతో ఆయనను కార్యాలయంలో కలిసి శాలువాతో సన్మానించారు.పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా బుస్సా రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు రైతుల భూసమస్యల పరిష్కారానికి రీసర్వే కార్యక్రమం అమలు చేస్తున్నట్లు తెలిపారు.స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు చొరవతో ఇప్పటికే గర్భకండ్రిక,ఇండ్ల పట్టాల రిజిస్ట్రేషన్ తదితర సమస్యలు పరిష్కరిస్తున్నట్లు తెలిపారు.ఇందులో బాగంగా గ్రామాల్లో నెలకొన్న అనేక భూసమస్యలు సత్వరమే పరిష్కరించాల్సిందిగా ఆయన తహసిల్దార్‌కు విజ్ఞప్తిచేసినట్లు వివరించారు.ఈ కార్యక్రమంలో తిరపతయ్య, కొండలరావు బి.రమణయ్యలతోపాటు ఒగూరు,పలుకూరు, కొండికందుకూరు,విక్కిరాలపేట,కొండముదుసుపాలెం,నరిసెట్టివారిపాలెం,మోపాడు తదితర గ్రామాల నుంచి పలువురు తేదేపా నేతలు పాల్గొన్నారు.

## మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి - జేసీ శ్రీనివాసులు




**మార్కాపురం, మార్చి 6, ప్రభాతవార్త**
ఈ నెల 8వ తేదీన జరగనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. ఈ వేడుకల నిర్వహణపై శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ సుమారు 3 వేల మంది మహిళలతో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు.కార్యక్రమం విజయవంతంగా జరిగేలా మెప్మా,ఐసిడిఎస్ శాఖల సిబ్బందితో సమన్వయం చేసుకుని ఏర్పాట్లు చేయాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు తెలియజేసే విధంగా ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేయాలని చెప్పారు.వేడుకలకు హాజరయ్యే మహిళలకు మంచినీరు, భోజన వసతి వంటి సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో ఆర్డీవో1,2 పి. ప్రభాకర్, డిఎంహెచ్‌ఓ టి.వాణిశ్రీ, ఐసిడిఎస్ ఇంచార్జి పీడీ పద్మావతి తదితర అధికారులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు,మహిళా సాధికారితపై అవగాహనా కార్యక్రమం



**పొన్నలూరు మార్చి 6, ప్రభాతవార్త**
మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా ఐసిడీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని మాలపాడు గ్రామ సచివాలయంలో బాల్య వివాహాలు,మహిళా సాధికారిత,ఇతర అంశాల మీద మహిళలకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ షేక్ రిజ్వానా మాట్లాడుతూ బాల్య వివాహాలు, మహిళా సాధికారిత, ప్రధానమంత్రి మాతృ వందన యోజన,మిషన్ శక్తి తదితర అంశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిరిగిరిగోపాల్ రెడ్డి,ఎంఎల్ హెచ్ పి ఉష,సచివాలయం సిబ్బంది అంగన్వాడి టీచర్లు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# రేపు మండల సర్వసభ్య సమావేశం

**తాళ్లూరు, మార్చి 6, ప్రభాతవార్త**
మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశపు మందిరంలో ఈ నెల 8వ తేదీ ఉదయం 10 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పి. అజిత తెలిపారు.ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి జడ్పీటీసీ, మండల పరిధిలోని ఎంపీటీసీలు, గ్రామ సర్పంచులు, గ్రామ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఎంపీడీవో తెలిపారు.

# నేరాల నియంత్రణకే కార్డన్ సెర్చ్



**తాళ్లూరు, మార్చి6 ,ప్రభాతవార్త**
నేరాల నియంత్రణకే పోలీసుశాఖ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు దర్శి సీఐ వై. రామారావు,ఎస్ఐ ఎస్.మల్లికార్జునరావులు తెలిపారు.ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, దర్శి డీఎస్పీ బి.లక్ష్మి నారాయణ ఆదేశాలు మేరకు సీఐ, ఎస్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం తాళ్లూరు గ్రామంలో పాముల కాలనీలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ప్రతి గృహాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. చట్టవ్యతిరేక కార్యక లాపాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరిస్తూ గృహాల్లో తనిఖీలను ప్రోత్సహించాలన్నారు.తనిఖీల్లో సరైన పత్రాలు లేని 13 బైక్ లను సీజ్ చేశారు. సంబంధిత పత్రాలు చూపిన వారికి వాహనాలు ఇస్తామన్నారు లేనిచో కేసు నమోదు చేస్తామని తెలిపారు. కాలనీల్లోని ఇళ్లలో కొత్త వ్యక్తులు ఎవరైన ఉన్నారా,గంజాయి, మత్తు పదార్థాలు, మారనాయుధాలు వంటివి ఏమైనా ఉన్నాయా అని సోదాలు నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలు, మాదక ద్రవ్యాల వాడకం వలన కలిగే అనర్థాలు, సైబర్ నేరాలు కొత్త చట్టాలు, మహిళలపై నేరాలు,శిక్షలపై అవగాహన కల్పించారు. డ్రగ్స్ వద్దు బ్రో అనే నినాదంతో ర్యాలీ నిర్వహించి, మానవహారంగా ఏర్పడి డ్రగ్స్ నిర్మూలనకు, గంజాయిని పారదులుదాం అంటూ ప్రతిజ్ఞ చేయించారు. సీఐ, ఎస్ఐ మాట్లాడుతూ గంజాయి,మాదకద్రవ్యాలు వినియోగం వల్ల జీవితం, కుటుంబాలు నష్టపోతుందని వివరించారు. ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి చదువు, క్రీడలు, ఉపాధి వంటి సానుకూల మార్గాలపై దృష్టి సారించాలని సూచించారు. డ్రగ్స్,గంజాయి విక్రయం, వినియోగానికి పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.కార్యక్రమంలో ముండ్లమూరు ఎస్ ఐ కమలాకర్,ఏఎస్ఐ లు, కానిస్టేబులు పాల్గొన్నారు.

# బాల్యవివాహాలను ప్రోత్సహించ వద్దు



**తాళ్లూరు,మార్చి6,ప్రభాతవార్త**
బాల్యవివాహాలకు బాలికల తల్లిదండ్రులు దూరంగా ఉండాలని కేజీబీవీ ప్రిన్సిపాల్ పి.సుజిత సూచించారు.ఈ నెల 8న అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా శుక్రవారం తాళ్లూరు లోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ జిల్లా కోఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో బాలికలకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరాలన్నారు. చిన్నతనంలోనే వివాహాలను ప్రోత్సహించరాదన్నారు.బాలికలు విద్యపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఏ. కిరణ్,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నూతన ఆవిష్కరణలు సృష్టించాలి

**- జన విజ్ఞాన వేదిక జిల్లా ఆరోగ్య కన్వీనర్ డాక్టర్ బి శరత్**



**మార్కాపురం టౌన్, మార్చి 6, ప్రభాతవార్త**
ప్రతి ఒక్క విద్యార్థి నూతన ఆవిష్కరణలు సృష్టించేలా ఆలోచించాలని జన విజ్ఞాన వేదిక జిల్లా ఆరోగ్య కన్వీనర్ డాక్టర్ బి శరత్ కోరారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సైన్స్ డే వారోత్సవాల సందర్భంగా మార్కాపురంలోని గౌతమీ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నూతన ఆవిష్కరణలు శాస్త్రీయ విజ్ఞానం అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ బి శరత్ మాట్లాడుతూ శాస్త్రవేత్తల కృషిని ఆదర్శంగా తీసుకొని భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా తయారు కావాలన్నారు. జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి ఏనుగుల రవికుమార్‌మాట్లాడుతూ మూఢనమ్మకాలను వదిలిపెట్టి శాస్త్రీయదృక్పథాన్ని పెంపొందించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ గోలమారి వీరారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు



**మార్కాపురం టౌన్, మార్చి 6, ప్రభాతవార్త**
మార్కాపురం జిల్లా మార్కాపురం పట్టణంలోని భగత్ సింగ్‌కాలనీ అంగన్వాడి కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ పద్మావతి మాట్లాడుతూ ప్రధానమంత్రి మాతృ వందన యోజన పథకం గురించి గర్భవతులు, బాలింతలకు వివరించారు. రిజిస్ట్రేషన్ ఎలా చేయించాలి దానికి సంబంధించి అమోంట్ గురించి తెలియజేశారు. సమాజంలో మహిళల ప్రాముఖ్యత గురించి వివరించారు. అన్ని రంగాల్లో మహిళలు ముందుకు రావాలని కోరారు. ఈకార్యక్రమంలో సూపర్వైజర్‌లక్ష్మీ,కార్యకర్తలు ఓ.పద్మావతి, ఏ.శ్రీదేవి,వి.సునీత తదితరులు పాల్గొన్నారు.

## అల్లు వారి వివాహ వేడుకలో మంత్రి కొలుసు, కదిరి కుటుంబ సభ్యులు



**సీఎస్‌పురం, మార్చి 6, ప్రభాతవార్త**
కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురవు సోదరి అల్లు తనూజ, శ్రీనివాస్ కుమారుడు అల్లు గిరి వెంకటేష్, తేజస్వీల వివాహ వేడుక గురువారం రాత్రి విజయవాడలో వైభవంగా జరిగింది. ఈ వివాహ వేడుకలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ, కనిగిరి మాజీ ఎమ్మెల్యే వైసీపీ విశాఖపట్నం పార్లమెంట్ పరిశీలకులు కదిరి బాబురావు, ఎమ్మెల్యేలు బొండ ఉమామహేశ్వరరావు, బోడె ప్రసాద్, వర్ల కుమార్ రాజా పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కదిరి ప్రకాష్‌రావు, కదిరి పార్థసారధి, కదిరి బాలకృష్ణ, ఆప్టా వ్యవస్థాపక అధ్యక్షులు చందు శ్రీనివాస్, రక్షిత ఫార్మసీ కంపెనీ అధినేత చందన రామేశ్వరరవు, సుంకరి వెంకటాద్రి, కదిరి పిచ్చయ్య, కదిరి రమణయ్య, కదిరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# 14వ వార్డులో రెండు నూతన బోర్లు ప్రారంభం



**గిద్దలూరు, మార్చి 6, ప్రభాతవార్త**

గిద్దలూరు పట్టణంలోని ప్రజల సౌకర్యార్థం రాబోయే ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి చొరవతో 14వ వార్డులో బిపిఎస్, ఎల్ఆర్ఎస్ నిధుల ద్వారా రెండు నూతన బోర్లను ఏర్పాటు చేశారు. ఈ బోర్లను శుక్రవారం నియోజకవర్గ టిడిపి నాయకులు ముత్తుముల కృష్ణకిషోర్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## యర్రగొండపాలెం వైసిపి పరిశీలకులుగా పిడతల ప్రవీణ్ కుమార్ రెడ్డి



**గిద్దలూరు, మార్చి 6, ప్రభాతవార్త**

గిద్దలూరు వైఎస్సార్‌సీపి నాయకులు, వైసిపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ పిడతల ప్రవీణ్ కుమార్ రెడ్డి యర్రగొండపాలెం నియోజకవర్గ వైసిపి పరిశీలకులుగా నియమించబడ్డారు. మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు. నూతనంగా యర్రగొండపాలెం వైసిపి పరిశీలకుడిగా ఎన్నికైన ప్రవీణ్ కుమార్ రెడ్డికి పలువురు శుభాకాంక్షలు చెబుతున్నారు. పార్టీ బలోపేతానికి తన వంతు బాధ్యతగా పనిచేస్తానని ప్రవీణ్ కుమార్ రెడ్డి అన్నారు.

## చెరువు కొమ్ముతాండ గ్రామ సరిహద్దు పొలాలలో గుర్తు తెలియని వ్యక్తి మృతి





**త్రిపురాంతకం, మార్చి 6, ప్రభాతావార్త**

మండలంలోని చెరువుకొమ్ము తండా గ్రామ సరిహద్దు పొలాల్లో 65 నుండి 75 సంవత్సరాల వయసు లోపు గల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే గ్రామస్తులు త్రిపురాంతకం పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందిన వెంటనే పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి అస్సాన్, ఎస్సై శివరామయ్య తమ సిబ్బందితో కలసి మృతి చెందిన వ్యక్తి వద్దకు వెళ్లి సంఘటన స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం చనిపోయిన వ్యక్తి తెలుపు రంగు చొక్కా వేసుకొని ఉన్నాడని, అతని పక్కనే బునుగు, ఎరుపు రంగు గల దుప్పటి ఉందని తెలిపారు. స్థానిక గ్రామస్తుల్ని మృతుని వివరాలను అడగ్గా తమకు తెలియదని గ్రామస్తులు పోలీసులకు తెలియజేశారని పోలీసులు తెలిపారు. మృతుని బంధువులు త్రిపురాంతకం పోలీస్ స్టేషన్‌లో సంప్రదించవలసిందిగా ఎస్సై శివరామయ్య తెలిపారు. మృతుని వివరాలకై 9121102196, 9121102237ను సంప్రదించవలసినదిగా పోలీసులు తెలియజేశారు.

# కారును ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరు మృతి



**త్రిపురాంతకం, మార్చి 6, ప్రభాతావార్త**

కారును ద్విచక్ర వాహనం ఢీకొనడంతో బైకుపై వెళ్తున్న దూదేకుల ఖాశిం (63) మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం త్రిపురాంతకం మండలం ముడివేముల గ్రామానికి చెందిన ఖాసిం దెయ్యపు వాగు సమీపంలో స్టార్ హోటల్ రెస్టారెంట్ నిర్వహిస్తున్నారు. ఆయన హోటల్ పని నిమిత్తం త్రిపురాంతకం వస్తున్న క్రమంలో ఎదురుగా వస్తున్న కార్ ఢీకొట్టడంతో ఖాశింకు తీవ్రగాయాలు కాగా స్థానికులు బంధువుల సహాయంతో త్రిపురాంతకం ప్రవేటు వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం నరసరావు పేటలో ప్రవేటు వైద్యశాలలో చేర్పించారు. అక్కడ వైద్యం అందుతూ ఉండగా మృతి చెందారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# మహిళల భద్రతపై అవగాహన

## - పోలీస్ స్టేషన్లలో విద్యార్థినులకు ఓపెన్ హౌస్





**మార్కాపురం, మార్చి 6, ప్రభాతవార్త**

అంతర్జాతీయ మహిళా దినోత్సవం-2026 సందర్భంగా మార్కాపురం జిల్లా పోలీసులు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో విద్యార్థినుల కోసం ఓపెన్ హౌస్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. మార్కాపురం టౌన్, మార్కాపురం రూరల్, త్రిపురాంతకం, వెలిగండ్ల, కనిగిరి, టి.వి.పల్లి తదితర పోలీస్ స్టేషన్లలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థినులు పోలీస్ స్టేషన్ల పనితీరును ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం కల్పించారు. పోలీస్ అధికారులు స్టేషన్‌లో నిర్వహించే విధులు, మహిళా సహాయ కేంద్రం సేవలు, పోలీసులు ఉపయోగించే పరికరాలు, కేసుల రికార్డుల నిర్వహణ, కొత్త చట్టాల అమలు వంటి అంశాలపై విద్యార్థినులకు వివరించారు. అదేవిధంగా మహిళలకు సంబంధించిన చట్టాలు, ఫోక్సో చట్టం, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, గుడ్ టచ్-బ్యాడ్ టచ్ వంటి అంశాలతోపాటు సామాజిక మాధ్యమాల వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సైబర్ క్రైమ్‌ల నుంచి రక్షణ పొందే మార్గాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మార్కాపురం సిఐ సుబ్బారావు మాట్లాడుతూ బాలికలు తప్పనిసరిగా స్వీయ రక్షణ నైపుణ్యాలను అభ్యసించుకోవాలని సూచించారు. టెక్నాలజీ యుగంలో సైబర్ భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, అనుమానాస్పద లింకులు క్లిక్ చేయకూడదని, అనధికారిక యాప్స్ డౌన్‌లోడ్ చేయవద్దని హెచ్చరించారు. మొబైల్ ఫోన్ల వినియోగాన్ని పరిమితంగా ఉంచుకోవాలని సూచించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థినులు చదువులో రాణించి సమాజానికి, రాష్ట్రానికి, దేశానికి ఉపయోగపడే వ్యక్తులుగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. మహిళల భద్రతకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, అత్యవసర సమయంలో పోలీసుల సహాయం తీసుకోవాలని అధికారులు తెలిపారు. అత్యవసర సమయంలో సహాయం కోసం చైల్డ్ హెల్ప్ లైన్ 1098, ఉమెన్ హెల్ప్ లైన్ 181, పోలీస్ హెల్ప్ లైన్ 100 / 112, సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ 1930, పోలీస్ కంట్రోల్ రూమ్ 9121102266 నెంబర్లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో పలు పోలీస్ స్టేషన్ల అధికారులు, సిబ్బంది పాల్గొని విద్యార్థినులకు అవగాహన కల్పించారు.

# పన్నుల వసూళ్లను నూరుశాతం పూర్తి చేయాలి

## - ఎంపీడీవో వెంకటరామిరెడ్డి



**రాచర్ల,మార్చి 6, ప్రభాతవార్త**

పన్నుల వసూళ్ళను సిబ్బంది రెండు, మూడు రోజుల్లో నూరుశాతం పూర్తి చేయాలని మండల ఎంపిడిఓ ఎస్ వెంకటరామిరెడ్డి అన్నారు. రాచర్లలో ఇంటి పన్నుల వసూలు కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఓ గృహ యజమాని ద్వారా పన్ను స్వీకరించి స్వయంగా అతనికి రశీదును అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత మండలంలో 57శాతం మాత్రమే పన్ను వసూలు జరిగిందని ఇంకా 43శాతం వసూలు చేయాల్సి ఉందన్నారు. కొంతమంది సిబ్బంది పన్ను వసూలు విషయంలో చాలా నిరక్ష్యంగా బాధ్యతరాహిత్యంగా వ్యవహరిస్తున్నారని వారు పద్ధతి మార్చుకోవాలని అన్నారు. ఆయన వెంట డిప్యూటీ ఎంపీడీవో ఐ వెంకటేష్, రాచర్ల పంచాయతీ కార్యదర్శి నాయక్ తదితరులు ఉన్నారు.

# సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేస్తా !

## - అర్జీదారుల సంతృప్తిని పరిగణనలోకి తీసుకుంటాం



**కందుకూరు మార్చి 6, ప్రభాతవార్త**

ప్రజాసమస్యల పరిష్కారానికి సత్వర కృషిచేస్తానని కందుకూరు తహసిల్దార్ పి.మురళి అన్నారు. ఇందులో నిబంధనలమేరకు అర్జీదారుల సంతృప్తిస్థాయిని పరిగణనలోకి తీసుకుంటామని ఆయన వివరించారు. శుకృవారం ఆయన ప్రభాతవార్త ప్రతినిధితో మాట్లాడారు. ప్రజాసమస్యల సత్వర పరిష్కారానికి ప్రభుత్వం ప్రజావిజ్ఞప్తుల కార్యక్రమం పకడ్బందీగా నిర్వహిస్తుందన్నారు. ఇందులో అర్జీదారుల సంతృప్తిస్థాయిని పరిగణనలోకి తీసుకుంటుందని తెలిపారు. ఈ నేపధ్యంలో క్షేత్రస్థాయి అధికారులు సదరు అర్జీలను నిబంధనల మేరకు సకాలంలో పరిష్కరించాలన్నారు. పరిష్కారానికి వీలుకాని సమస్యలపై సదరు కారణంతో అర్జీదారునికి తెలియపరచాలన్నారు. దీంతో అర్జీదారుడు ప్రత్యామ్నాయంచర్యలు తీసుకుంటారని ఆయన వివరించారు. అంతేగానీ పరిశీలన అంటూ నెలలు తరబడి సదరు అర్జీని పెండింగులో ఉంచడం,ఆ తరువాత వీలుకాదని తిరస్కరించడం సమంజసం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. తాను ఇటీవలనే పదవీ బాధ్యతలు చేపట్టానన్నారు. తొలుత పెండింగు సమస్యల క్లియర్ చేస్తున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి శక్తివంచనలేకుండా కృషిచేస్తానని ఆయన వివరించారు. ఇందుకు సహకరించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తిచేశారు.

# బాష్యం పాఠశాలలో విద్యార్థుల పట్టభద్రుల సంబరాలు

## - మెరిట్ సర్టిఫికెట్లు అందజేసిన తహాశిల్దార్ చిరంజీవి



**మార్కాపురం, మార్చి 6, ప్రభాతవార్త**

మార్కాపురం పట్టణంలోని భాష్యం పాఠశాలలో శుక్రవారం యుకేజీ, ఐదవ తరగతి విద్యార్థుల పట్టభద్రుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రకాశం జోన్ జెడ్ఈఓ కృష్ణ గణేష్ ఆదేశాల మేరకు పాఠశాల ప్రిన్సిపల్ కెవి నాగరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మార్కాపురం మండల తహాశిల్దార్ కే చిరంజీవి, డిప్యూటీ తాసిల్దార్ శ్రీనివాసులు హాజరై విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా తాసిల్దార్ చిరంజీవి మాట్లాడుతూ గ్రాడ్యుయేషన్ దినోత్సవ వేడుకలు విద్యార్థుల్లో చదువుపై మరింత ఆసక్తి, ఆత్మవిశ్వాసం పెంచుతాయని పేర్కొన్నారు. చిన్న వయసులోనే లక్ష్యంతో చదువుకుంటే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు హాజరైన వారిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల లిటిల్ చాంప్స్ ఇంచార్జ్ హేమసుధ, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# వైవీ సుబ్బారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన వైసీపీ నాయకులు

## - మార్కాపురం జిల్లా రాజకీయాలపై చర్చ



**మార్కాపురం, మార్చి 6,ప్రభాతవార్త**

ఒంగోలు పట్టణంలో వైసీపీ సీనియర్ నాయకుడు వైవీ సుబ్బారెడ్డిని ఆయన స్వగృహంలో పలువురు వైఎస్సార్‌సీపి పార్టీ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా మార్కాపురం జిల్లా ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతం వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి అన్నా రాంబాబు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కొండేపి నియోజకవర్గ పరిశీలకులు డాక్టర్ షంషీర్ అలీ బెగ్, మార్కాపురం మున్సిపల్ చైర్మన్ బాల మురళి కృష్ణ పాల్గొన్నారు. అదే విధంగా పార్టీకి చెందిన పలువురు ముఖ్య నాయకులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని వైవీ సుబ్బారెడ్డితో వివిధ రాజకీయ అంశాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. మార్కాపురం జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా నాయకులు నిర్ణయించినట్లు సమాచారం.

# బాలికలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

## - అవగాహన కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటేశ్వర్లు



**రాచర్ల, మార్చి 6 ప్రభాతవార్త**

మహిళా చట్టాలపై బాలికలు అవగాహన కలిగి ఉండాలని రాచర్ల ఏఎస్ఐ కె.వెంకటేశ్వర్లు అన్నారు. జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణంలో విద్యార్థినీలకు చట్టాల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ వెంకటేశ్వర్లు పోలీస్ స్టేషన్ పరిసరాలలో మొక్కల పెంపకం, స్టేషన్, లాకప్, వైర్లెస్ నిర్వహణ తదితర అంశాలపై విద్యార్ధినీలకు బాలికలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, విద్యార్ధినీలు తదితరులు పాల్గొన్నారు.

# కష్టపడి పనిచేయండి - జగనన్నను సీఎం చేయండి

## - వివిపాలెం కార్యకర్తలకు బుర్రా సూచనలు



**కందుకూరు మార్చి 6, ప్రభాతవార్త**

2029లో జగనన్నను తిరిగి ముఖ్యమంత్రిగా చేద్దామని కందుకూరు వైసీపీ ఇన్‌చార్జీ బుర్రా మధుసూదన్‌యాదవ్ అన్నారు. ఇందుకోసం పార్టీని బలోపేతం చేయాలని ఆయన కార్యకర్తలకు సూచించారు. కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు మంచి భవిష్యత్ ఉంటుందని ఆయన అన్నారు. శుకృవారం పట్టణ వైసీపీకార్యాలయంలో మండలపార్టీఅధ్యక్షుడు అనుమోలు లక్ష్మినరసింహం ఆధ్వర్యంలో వలేటివారిపాలెం మండల కార్యకర్తల సమీక్షా సమావేశం నిర్వహించారు. అసంపూర్తిగా మిగిలినఅమ్మపాలెం, శాఖవరం, నేకునాంవురం, కాకుటూరు, వలేటి వారిపాలెం, కలవళ్ల గ్రామాల ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించారు. గ్రామకమిటీల ప్రక్రియను పూర్తిచేశారు. ఈ సందర్భంగా బుర్రా మధుసూదన్‌యాదవ్ మాట్లాడుతూ పార్టీని బలంగా తీర్చిదిద్దేందుకు అందరం కలిసి ఐకమత్యంగా పనిచేద్దామన్నారు. కష్టకాలంలో పార్టీ జెండాను భుజాన వేసుకొని మోసేవాళ్లకి మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. నాయకుల మధ్య అభిప్రాయ భేదాలు లేకుండా పార్టీని బలోపేతం చేసేందుకు కలిసి పని చేయాలని ఆయన సూచించారు. జగనన్నను తిరిగి ముఖ్యమంత్రి చేసుకొనేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త నడుంబిగించవలసిన సమయం ఆసన్నమైందని తెలియజేసారు. పార్టీ అధికారంలో ఉన్న లేకున్నా ఉత్సాహంగా ఉల్లాసంగా కమిటీల ఎంపిక ప్రక్రియను పూర్తిచేసిన నేతలందరికి కృతజ్ఞతలన్నారు. ఈ కార్యక్రమంలో ఇరపని అంజయ్య, చెన్నబోయిన శ్రీను, నరేంద్రరెడ్డి, కంచర్ల కోటయ్య, మద్దాళి రామారావు, పోకూరు జాగర్లమూడి రాంబాబు శాఖవరం మాజీ డీలరు నవులూరి రత్తయ్య, రూపినేని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించండి

## - కందుకూరులో బీటీఏ నిరసన



**కందుకూరు మార్చి 6, ప్రభాతవార్త**

ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుకృవారం కందుకూరు అంబేద్కర్ విగ్రహం వద్ద నల్లబ్యాడ్జీలతో పలువురు ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు షేక్ అబ్దుల్లా మాట్లాడుతూ రాష్ట్రశాఖ పిలుపులో బాగంగా శుకృవారం ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ప్రదానంగా 12వ పే రివిజన్ కమిషన్ వెంటనే నియమించాలని, 4డీఏల బకాయిని చెల్లించాలని, సిపిఎస్ రద్దుచేయాలని, ఓపిఎస్‌ను ఇవ్వాలని, నియామకాలు మరియు ప్రమోషన్స్ రోస్టర్ కం మెరిట్ పద్ధతి పాటించాలని తదితర డిమాండ్లును పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమములో బీటీఏ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కల్లగుంట మోహన్‌రావుతో పాటు సంఘనేతలు కసుకుర్తి అంజయ్య, మెండా వెంకట్రావు, దన్యాసి కోటేశ్వరరావు, పరైవెంకట్రావు, గుడిపూడి వెంకట్రావు, పసుపులేటి గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# 12న మండల సర్వసభ్య సమావేశం

**కంభం, మార్చి 6 ప్రభాతవార్త**

ఈ నెల 12వ తేదీ గురువారం కంభం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో వీరభద్రాచారి శుక్రవారం ప్రకటన తెలిపారు. బుధవారం ఉదయం 10.30గంటలకు స్థానిక ఎంపిడిఓ కార్యాలయ సమావేశపు హాలులో జరిగే ఈ సమావేశంలో వైద్య ఆరోగ్యశాఖ, గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్యం, పౌరసరఫరాల శాఖ, పంచాయతీరాజ్‌శాఖ, నీటిపారుదల శాఖ, గృహ నిర్మాణ శాఖ, ఇంకా పలు శాఖల అధికారులతో సమీక్షా సమావేశం జరుగుతుందన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీ, జడ్పిటిసి, సర్పంచులు అందరూ హాజరుకావాల్సిందిగా కోరారు.

## అటవీ శాఖకు చెందిన దోర్నాలలో అడ్వెంచర్ పార్క్ వద్ద అగ్ని ప్రమాదం



**పెద్దదోర్నాల, మార్చి 6, ప్రభాతవార్త**

మండల కేంద్రమైన పెద్దదోర్నాల గణపతి ఫారెస్ట్ చెక్‌పోస్టు సమీపంలో అడ్వెంచర్ పార్కు వద్ద శుక్రవారం అగ్ని ప్రమాదం సంభవించింది. ప్రయాణికుల, పిల్లలు ఆడుకునేందుకు ఆటవిడుపు కోసం అటవీ శాఖ ఏర్పాటు చేసిన అడ్వెంచర్ పార్కు వద్ద అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఉదయ కాలపు నడకలు, శారీరక దారుఢ్యం కోసం వ్యాయామ పరికరాలతో అటవీశాఖ ఈ పార్కును అభివృద్ధి చేసి త్వరలో ప్రారంభించేందుకు సిద్ధం చేసింది. అయితే పార్కు చుట్టూ ఉన్న కొండ ప్రాంతాల్లో గుర్తు తెలియని ఆకతాయిలు నిప్పుపెట్టడంతో మంటలు వ్యాపించాయి. దీంతో పార్కు పరిసరాల్లో అటవీశాఖ సిబ్బంది పచ్చదనం కోసం నాటిన చెట్లు అగ్నికి ఆహుతి అయ్యాయి. సమాచారం అందుకున్న అటవీశాఖ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకున్నారు.

## సత్వరమే ఇళ్ల పన్నులను చెల్లించి గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలి

## - ఎంపీడీవో సురేష్‌బాబు



**సంతనూతలపాడు, మార్చి 6, ప్రభాతవార్త**

ప్రజలు సత్వరమే ఇళ్ల పన్నులను చెల్లించి గ్రామాల అభివృద్ధికి పాటు పడాలని సంతనూతలపాడు ఎంపీడీవో డి.సురేష్‌బాబు కోరారు. సంతనూతలపాడు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నాడు మండల స్థాయి అధికారులు, సిబ్బందితో ఇళ్ల పన్నులు వసూళ్ల ముమ్మర కార్యక్రమంపై ఎంపీడీవో సురేష్‌బాబు ప్రత్యేకంగా సమీక్షించారు. జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు ఆదేశాల మేరకు సంతనూతలపాడు మండలంలో ఇళ్ల పన్నులు వసూళ్ల కార్యక్రమాలపై స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఎంపీడీవో సురేష్‌బాబు వెల్లడించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందాలంటే ఆయా లబ్దిదారులు ఈనెల 20వ తేదీ లోపు ఇళ్ల పన్నులను చెల్లించాలని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. మండలంలోని 18 పంచాయతీల పరిధిలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి రెండు కోట్ల 22 లక్షల రూపాయల ఇళ్ల పన్నుల టార్గెట్ అమలు కాగా నేటి వరకు కోటి పది లక్షల రూపాయల పన్నులను వసూళ్ల చేసి 50 శాతం మేరకు లక్ష్యం నెరవేర్చినట్లు ఎంపీడీవో సురేష్‌బాబు వెల్లడించారు. డ్వాక్రా గ్రూపు సభ్యులందరూ కూడా ఇళ్ల పన్నులను సత్వరమే చెల్లించాలన్నారు. అవసరమైతే డ్వాక్రా రుణాలను తీసుకొని వీటిని చెల్లించాలని ఎంపీడీవో సురేష్‌బాబు పేర్కొన్నారు. ఆయా పంచాయతీలకు రోజు వారీగా కేటాయించిన టార్గెట్ ప్రకారం పంచాయతీ అభివృద్ధి అధికారులు, సచివాలయ సిబ్బంది ముమ్మరంగా స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం ద్వారా ఇళ్ల తదితర పన్నులు వసూళ్ల చేయాలన్నారు. ప్రభుత్వ కార్యాలయంలో కూడా పెండింగ్ హౌస్ టాక్స్ లను సత్వరమే వసూళ్ల చేయాలన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి మార్చి 31వ తేదీతో ముగియనున్న సందర్భంగా ప్రతి ఒక్కరూ ఈ నెల 20వ తేదీ లోపు సత్వరమే ఇళ్ల పన్నులను చెల్లించాలని ఎంపీడీవో సురేష్‌బాబు కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవోలు రవికుమార్, అరుణ కుమారి, మండల పరిషత్ ఏవో ప్రసూనా, మండల పరిషత్ ప్రతినిధులు వినీల్ కుమార్, బాలకృష్ణ, భాష తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ జీవిత చరిత్ర కళారూపకం(నాటకం) కరపత్రాల ఆవిష్కరణ

## - నేడు నాటక ప్రదర్శన



**సంతనూతలపాడు, మార్చి 6, ప్రభాతవార్త**

ఈనెల 7వ తేదీన శనివారం సాయంత్రం సంతనూతలపాడు బస్టాండ్ సెంటర్లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ జీవిత చరిత్రను అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ హైదరాబాద్ వారిచే బుద్ధం శరణం గచ్చామి నాటక ప్రదర్శన జరుగుతుందని ప్రజా సంఘాల నాయకులు తెలిపారు. సంతనూతలపాడులోని ప్రజా సంఘాల కార్యాలయంలో కేవీపీఎస్, వ్యవసాయ కార్మిక సంఘం, అంబేద్కర్ యువజన సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నాడు కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శనివారం మార్చి 7వతేదీ సాయంత్రం సంతనూతలపాడు బస్టాండ్ సెంటర్ వద్ద ప్రదర్శించబడుతున్న అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో సంఘం శరణం గచ్చామి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జీవిత చరిత్ర ఆధారంగా రూపొందించిన నాటకాన్ని మండలంలోని ప్రజానీకం చూసి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రఘురామ్ పాల్గొని మాట్లాడుగూ అట్టడుగు వర్గాల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆలోచనలు సమాజానికి మార్గదర్శకమని తెలిపారు. అంబేద్కర్ జీవిత చరిత్ర ఆధారంగా రూపొందించిన ఈ నాటకం ప్రజల్లో చైతన్యం కలిగిస్తుందని, అందరూ పెద్ద ఎత్తున పాల్గొని నాటకాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నెరుసుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అట్టడుగు వర్గాలను అభివృద్ధి శిఖరాల వైపు తీసుకెళ్లడంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చేసిన సేవలు అపారమని కొనియాడారు. అంబేద్కర్ ఆలోచనలను కళారూపంగా ప్రజల ముందుకు తీసుకొస్తున్న ఈ నాటకం సమాజంలో చైతన్యం కలిగించే ప్రయత్నమని పేర్కొన్నారు. అందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం ప్రతినిధులు పాల్గొని తమ సంఘం తరుపున నాటకానికి మద్దతు ప్రకటించారు. కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో మహిళా సంఘం నాయకురాలు ఎన్.మాలతి, సీఐటీయు నాయకులు సంపత్, కేవీపీఎస్ నాయకులు ప్రభుదాసు, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు దాసరి ప్రకాశం, మార్పుడి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్ల పన్నుల వసూళ్ల ప్రక్రియను పరిశీలించిన ఎంపీడీవో సురేష్‌బాబు

**సంతనూతలపాడు, మార్చి 6, ప్రభాతవార్త**

మండలంలోని మంగమూరు, సంతనూతలపాడు కేంద్రాల్లో ఇళ్ల పన్నుల వసూళ్ల కార్యక్రమాలను శుక్రవారం నాడు ఎంపీడీవో డి.సురేష్‌బాబు పరిశీలించారు. ప్రజలు గ్రామాల్లో ఇళ్ల పన్నులను చెల్లించి గ్రామాల అభ్యున్నతికి పాటుపడాలని ఎంపీడీవో సురేష్‌బాబు కోరారు. ప్రతి రోజు టార్గెట్ ప్రకారం హౌస్ టాక్స్ కలెక్షన్ జరగాలని ఎంపీడీవో సురేష్‌బాబు, పంచాయతీ, సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ అభివృద్ధి అధికారులు ఆర్.శ్రీనివాసులు, ఎన్.ప్రతాప్ కుమార్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మద్దిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ముందస్తుగా మహిళా దినోత్సవ వేడుకలు



**సంతనూతలపాడు(మద్దిపాడు), మార్చి 6, ప్రభాతవార్త**

మద్దిపాడు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం నాడు ముందస్తుగా ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. శనివారం నాడు వాక్సినేషన్, ఆదివారం సెలవు దినాల్లో భాగంగా ముందస్తుగా శుక్రవారం నాడు ఈ మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. మద్దిపాడు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో డాక్టర్లు జగదీష్ బాబు, అన్వేష్ కుమార్, చౌదరి, ముస్తాబు సుల్తాన్ పర్యవేక్షణలో 55 మంది మహిళా సిబ్బందిని ఈ సందర్భంగా సత్కరించారు. 20 మంది ఏఎన్ఎంలు, 17 మంది ఎంఎల్‌హెచ్‌పీవోలు, ఇరువురు వైద్యులు, సీహెచ్‌ఓ, పీహెచ్ఎన్, హెచ్ఓ సీనియర్ అసిస్టెంట్, స్టాఫ్ నర్సులను ఈ సందర్భంగా సత్కరించారు.

# జర్నలిస్టు శివకిరణ్ మృతికి సంతాపం



**సింగరాయకొండ,మార్చి 6,ప్రభాతవార్త**

మండలంలోని పాకల గ్రామానికి చెందిన యువ వీడియో జర్నలిస్టు అంబటి శివకిరణ్ ఆకస్మిక మృతి కి పలువురు జర్నలిస్ట్ లు సంతాపం తెలిపారు. ఒంగోలు ప్రవేట్ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన స్వతంత్ర టీవీలో కొండేపి నియోజకవర్గం పరిధిలో వీడియో జర్నలిస్టుగా పనిచేస్తున్నారు. ఆయన మృతి వార్త తెలిసి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు పాకలగ్రామంలోని ఆయన నివాసానికి చేరుకుని పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శివకిరణ్ మృతి పట్ల జర్నలిస్టు వర్గాలు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశాయి. చిన్న వయస్సులోనే ఆయన మృతి చెందడం బాధాకరమని పేర్కొంటూ ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు. శుక్రవారం ఆయన స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహిస్తారని కుటుంబ సభ్యులు చెప్పారు.

# వాణిజ్య ఒప్పందం రైతాంగానికి హానికరం



**నాగులుప్పలపాడు, మార్చి 6, ప్రభాతవార్త**

భారత్ అమెరికా వాణిజ్య ఒప్పందం వలన రైతాంగానికి తీవ్ర నష్టం వాటిల్లితుందని కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు టి.శ్రీకాంత్ తెలిపారు. శుక్రవారం ఉప్పుగుండూరులో రైతు సంఘాల ఆధ్వర్యంలో వాణిజ్య ఒప్పందంపై సంతకం చేయరాదని నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్‌తో వాణిజ్య ఒప్పందం కుదిరిందని తద్వారా అమెరికాకు లాభదాయకంగా ఉంటుందని ప్రకటిస్తున్నప్పటికి మన దేశ ప్రధాని మోడీ నోరుమెదపక పోవడం కనీసం పార్లమెంట్ సమావేశాల్లో కూడా ప్రస్తావించకపోవడం ఇది మన దేశానికి అవమానకరమని విమర్శించారు. ఈ ఒప్పందం వలన అమెరికా నుండి దిగుమతి అయ్యే వ్యవసాయ, పారిశ్రామిక వస్తువులపై సుంకాలు ఎత్తివేస్తారు. ఈ క్రమంలో ఆ ఒప్పందంపై సంతకం నిలుపుదల చేసే వరకు అందరూ ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జి.బసవపున్నయ్య, వెంకటేశ్వర్లు, గుమ్మడి వీరాంజనేయులు, అలుగుల శివ, స్వర్ణ కిట్టమ్మ, జి.వెంకటరత్నం, సీహెచ్.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసుస్టేషన్‌ను సందర్శించిన సీఐ శేషగిరిరావు



**నాగులుప్పలపాడు, మార్చి 6, ప్రభాతవార్త**

ఒంగోలురూరల్ సీఐ ఎం.శేషగిరిరావు నాగులుప్పలపాడు పోలీసుస్టేషన్‌ను శుక్రవారం సందర్శించారు. నాగులుప్పలపాడు జడ్పీ హైస్కూల్ విద్యార్థినులకు పోలీసు వ్యవస్థ, న్యాయ వ్యవస్థ, ఫ్రెండ్లీ పోలీసింగ్, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ వంటి అంశాల గురించి తెలియజేసి అవగాహన కల్పించారు. వారితో పాటు ఎస్సై మహేంద్ర, పోలీసు సిబ్బంది, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు ఉన్నారు.

## వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి కుమార్తె వివాహానికి దద్దాల దంపతులకు ఆహ్వానం



**కనిగిరి, మార్చి 6, ప్రభాతవార్త**
ఈ నెల 20వ తేదీన జరగనున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కనిగిరి మండల నాయకులు, మాజీ యేరువారిపల్లి ఎంపీటీసీ వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి కుమార్తె వివాహానికి హాజరు కావాలని కనిగిరి నియోజకవర్గం వైసీపీ ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్, ఆయన ధర్మపత్ని మంజు భార్గవిని మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారికి దుశ్శాలువా కప్పి వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర వాలంటీర్ సంఘం అధ్యక్షులు ఆవుల భాస్కర్‌రెడ్డి, కనిగిరి వైసీపీ నాయకులు మార్తాల వెంకటేశ్వరరెడ్డి, చాగంరెడ్డి అమర్నాథ్‌రెడ్డి(నాని), తమ్మినేని ఫణీంద్ర, వీరంరెడ్డి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

## విజయవాడలో వైభవంగా అల్లు గిరి వెంకటేష్ - తేజస్వి వివాహం

### - మంత్రి కొలుసు, కదిరి బాబురావు కుటుంబ సభ్యుల హాజరు





**కనిగిరి, మార్చి 6, ప్రభాతవార్త**
కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు సోదరి అల్లు తనూజ, శ్రీనివాస్ దంపతుల కుమారుడు అల్లు గిరి వెంకటేష్, తేజస్వీ వివాహ వేడుక బుధవారం రాత్రి విజయవాడలో ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు పలువురు రాజకీయ ప్రముఖులు, బంధుమిత్రులు పెద్ద ఎత్తున హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారధి, మాజీ ఎంపీ బొత్స ఝన్సీ, కనిగిరి మాజీ ఎమ్మెల్యే, వైసీపీ విశాఖపట్నం పార్లమెంట్ పరిశీలకులు కదిరి బాబురావు, ఎమ్మెల్యేలు బొండ ఉమామహేశ్వరరావు, బొడెప్రసాద్, వర్ల కుమార్ రాజా తదితరులు పాల్గొని వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఈ వేడుకలో కదిరి ప్రకాష్‌రావు, కదిరి పార్థసారధి, కదిరి బాలకృష్ణ, ఆప్టా వ్యవస్థాపక అధ్యక్షులు చందు శ్రీనివాస్, రక్షిత ఫార్మసీ కంపెనీ అధినేత చందన రామేశ్వరరావు,సుంకరి వెంకటాద్రి, కదిరి పిచ్చయ్య, కదిరి రమణయ్య, కదిరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ వివాహ వేడుక వైభవంగా నిర్వహించబడగా, పలువురు అతిధులు నూతన దంపతులకు ఆశీస్సులు అందజేశారు.

## వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి కుమార్తె వివాహానికి ప్రముఖులకు ఆహ్వానం



**కనిగిరి, మార్చి 6, ప్రభాతవార్త**
ఈ నెల 20 వ తేదీన జరగనున్న వైసీపీ కనిగిరి మండల నాయకులు, మాజీ యేరువారిపల్లి ఎంపీటీసీ వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి కుమార్తె వివాహానికి పలువురు ప్రముఖులను మర్యాద పూర్వకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డి, వైసీపీ కనిగిరి మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్, మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్, వైసీపీ మహిళా అధ్యక్షురాలు పులిశాంతి, వైసీపీ మున్సిపల్ అధ్యక్షులు శిరపు గోవర్ధన్‌రెడ్డి, వైసీపీ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ పెరుగు మురళీకృష్ణ, ఐపీఎస్ అధికారి ఆవుల రమేష్‌రెడ్డి తండ్రి ఆవుల తిరుపతిరెడ్డిలను దుశ్శాలువాతో సత్కరించి వివాహ ఆహ్వాన పత్రికలను అందజేశారు. వివాహ వేడుకకు తప్పక హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర వాలంటీర్ల సంఘం అధ్యక్షులు ఆవుల భాస్కర్‌రెడ్డి, మార్తాల వెంకటేశ్వరరెడ్డి, చాగంరెడ్డి అమర్నాథ్‌రెడ్డి, తమ్మినేని ఫణీంద్ర, వీరంరెడ్డి చైతన్య తదితరులు పాల్గొన్నారు. వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి కుమార్తె వివాహ వేడుకను ఈనెల 20వ తేదీన ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఖాళీ ఉపాధ్యాయ పోస్టులన్నీ భర్తీ చేయాలి

### - డీవైఎఫ్ఐ




**కనిగిరి, మార్చి 6, ప్రభాతవార్త**
ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఖాళీగా ఉన్న అన్ని ఉపాధ్యాయ పోస్టులను రాబోయే డీఎస్సీ ద్వారా వెంటనే భర్తీ చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కేవీ పిచ్చయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కనిగిరిలోని సుందరయ్య భవన్‌లో డీవైఎఫ్ఐ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీ పిచ్చయ్య మాట్లాడుతూ జిల్లాలో ఉపాధ్యాయ పోస్టులు పెద్ద సంఖ్యలో ఖాళీగా ఉన్నప్పటికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదన్నారు. గతంలో జిల్లాలో సుమారు 900 ఎస్జీటీ పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికి కేవలం 120 పోస్టులకే నోటిఫికేషన్ విడుదల చేయడం నిరుద్యోగులకు అన్యాయం చేయడమేనని విమర్శించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో నిరుద్యోగ యువత అధికంగా ఉన్న నేపథ్యంలో ఉగాది సందర్భంగా ప్రకటించనున్న జాబ్ నోటిఫికేషన్‌లో జిల్లాలో దాదాపు 1000 వరకు ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. అలాగే ఎస్ఏ పోస్టులను కూడా పూర్తి స్థాయిలో భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలా చేయకపోతే నిరుద్యోగ యువతతో కలిసి డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు పి.నరేంద్ర, షేక్ నెహమ్మత్, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి షటిల్ పోటీలకు ఎంపికైన నాగేశ్వరరావు



**చీరాల, మార్చి 6, ప్రభాతవార్త**
75 ప్లస్ విభాగంలో చీరాల ఇండోర్ స్టేడియం చెందిన తుపాకుల నాగేశ్వరరావు జాతీయ స్థాయి షటిల్ బ్యాట్‌మెంట్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 2 నుండి 4వ తేదీ వరకు విజయనగరంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని విజయం సాధించి ఆయన ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు శుక్రవారం చీరాల ఇండోర్ షటిల్ బ్యాడ్మింటన్ స్టేడియంలో అభినందన సభ జరిగింది. తూర్పు గోదావరి జిల్లాకు చెందిన బాబుల్‌రెడ్డిపై విజయం సాధించి ఈనెల 18 నుంచి 24వ తేదీ వరకు గోవాలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు నాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ షటిల్ క్రీడాకారులు, డాక్టర్లు ఐ.బాబురావు, డాక్టర్ శంకర్‌రెడ్డిలు మాట్లాడుతూ గత సంవత్సరం కూడా తుపాకుల నాగేశ్వరరావు జయంతి స్థాయి షటిల్ టోర్నమెంట్‌కు ఎంపికైనట్లు వివరించారు. ఆయన క్రీడా నైపుణ్యం వల్ల చీరాలకు ఎనలేని కీర్తి ప్రతిష్టలు వచ్చాయని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు శ్రీనివాసమూర్తి, ఊటుకూరి సత్యనారాయణ, మద్దుకేదార్నాథ్, డాక్టర్ రామకృష్ణ, హనుమాన్, బట్టమోహన్‌రావు, జీవి నాగేశ్వరరావు, భాను తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజా దర్బార్



**చీరాల, మార్చి 6, ప్రభాతవార్త**
ప్రజల సమస్యల పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య ఆదేశానుసారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగింది. కార్యక్రమంలో పీఫోర్ సిబ్బంది నాయకులు ప్రజల వద్ద నుండి వినతుల అర్జీలు స్వీకరించారు. మొత్తం 25 అర్జీలు రాగా వీటిలో ఇంటి నిర్మాణం కోసం, ఇంటి స్థలం కోసం 17, పెన్షన్స్ 7, పలు సమస్యలపై 1, కార్యక్రమంలో చీరాల నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు లలిత, ఏఎంసీ డైరెక్టర్ పద్మిని, పట్టణ అధ్యక్షుడు సురేష్, మహిళా అధ్యక్షురాలు నాగేంద్రమణి, నాగలక్ష్మి, రాణి, కూటమి నాయకులు, వివిధ హోదాలో ఉన్న నాయకులు పాల్గొన్నారు.

## వ్యాళీ వాహనంపై ఊరేగిన శ్రీవారు

**కొనకనమిట్ల, మార్చి 6, ప్రభాతవార్త**
మండలంలోని గార్లెదిన్నె పంచాయతీ వెలుగొండ క్షేత్రంలో అలివేలు మంగా సమేత లక్ష్మీ శ్రీ వెంకటేశ్వరస్వామి(శ్రీవారు) బ్రహ్మోత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. అందులో భాగంగా శుక్రవారం రాత్రి ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు వ్యాళీ వాహనంపై వెలుగొండ వీధుల్లో ఊరేగారు. అర్చకులు నంద్యాల ప్రసాదాచార్యులు, భార్గవ రమణాచార్యులు, పవన్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో తొలుత మంత్రోచ్చరణలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్య నిర్వహణాధికారి చెన్నకేశవరెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మన్ కుందురు కాశిరెడ్డిల పర్యవేక్షణలో మధ్యాహ్నం నగరోత్సవం జరిగింది. ఈ ఉత్సవంలో ఉభయ దాతలు పాల్గొన్నారు.

# పదో తరగతి విద్యార్థులకు రక్త పరీక్షలు





**దర్శి, మార్చి 6, ప్రభాతవార్త**
దర్శి మండలంలోని తూర్పు చౌటపాలెం గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు చందలూరు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వై.సురేఖ, డాక్ట్ బి.బ్లెస్సి ఆధ్వర్యంలో 224 మంది విద్యార్థులకు బ్లడ్ గ్రూప్ పరీక్షలు హిమోగ్లోబిన్ పరీక్షలు ల్యాబ్ టెక్నీషియన్ వసంత్ కుమార్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్, బ్లెస్సి, ప్రమీల, విశాలాక్షి, ప్రశాంతి, కేశవ, ఏఎన్ఎం సునీత, హెల్త్ అసిస్టెంట్ జ్యోతిబాబు చేయడం జరిగింది. మెడికల్ ఆఫీసర్ సురేఖ మాట్లాడుతూ పిల్లలకి బ్లడ్‌గ్రూపు చాలా ముఖ్యం అని, తరువాత పదో తరగతి పిల్లలకు వైద్యపరీక్షలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పాఠశాలలో అంతర్జాతీయ మహిళ దినోత్సవ వేడుకలు



**దర్శి, మార్చి 6, ప్రభాతవార్త**
శివరాజ్‌నగర్ ఎంపీపీ స్కూల్‌లో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్‌కే హసీనాభాను, కేజీబీవీ స్కూల్ ప్రిన్సిపాల్ వై.అరుణ, యూపీహెచ్‌సీ డాక్టర్ దేవి ప్రియలు హాజరయ్యారు. ఈ సందర్భంగా అతిధులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయులు ధనిరెడ్డి వెంకటరెడ్డి అధ్యక్షత వహించారు. మహిళా దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. వివిధ రంగాలలో రాణించిన మహిళల గురించి పలువురు వక్తలు పిల్లలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు

### అవగాహన కల్పించిన ఎస్సై కమలాకర్



**ముండ్లమూరు, మార్చి 6, ప్రభాతవార్త**
బాల బాలికలు పోలీసు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సైబర్ నేరాలు, మహిళలకు ఉన్న చట్టాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్సై కమలాకర్ బాలికలకు సూచించారు. మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక పోలీసు స్టేషన్‌లో శుక్రవారం పాఠశాల బాలికలకు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించి, పోలీసు స్టేషన్ పరికరాలను చూపించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రతి మహిళ అధైర్య పడకుండా ధైర్యంగా సమస్యలను పరిష్కరించుకునే విధంగా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, 18 సంవత్సరాలు నిండకుడా వివాహాలు చేసుకోవద్దని, గ్రామాల్లో మీ చుట్టు పక్కల ఇంటి వారు బాల్య వివాహాలు చేస్తుంటే అలాంటి వాటిని నివారించాలని, తుపాకీ వాడకం, సీసీ కెమెరాలు, పోలీసు స్టేషన్ లోని నేరస్తుల గదులను విద్యార్థులకు చూపించి వాటి గురించి వివరించారు. పరిచయం లేని వారి వద్ద అప్రమత్తంగా ఉండాలని, పాఠశాలల్లో మీ పట్ల ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించిన, సైబర్ నేరాల గురించి తెలుసుకొని వాటిని మీ తల్లిదండ్రులకు అవగాహన కలుగజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై పీవీ హనుమంతరావు, హెడ్ కానిస్టేబుల్ కృష్ణ దాస్, సిబ్బంది ఉన్నారు.

## మండలంలో విస్తృతంగా పర్యటించిన డిఇఒ

### - పలు పాఠశాలలు సందర్శన

### - ఉపాధ్యాయులకు, విద్యార్థులకు పలు సూచనలు



**అద్దంకి, మార్చి 6,ప్రభాతవార్త**
బాపట్ల జిల్లా విద్యాశాఖ అధికారి డి శ్రీనివాస్ శుక్రవారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు అద్దంకి మండలంలోని వివిధ పాఠశాలలను సందర్శించారు. 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడి వారి యొక్క సమస్యలు తెలుసుకున్నారు. విద్యార్థుల సామర్థ్యాలు తెలుసుకున్నారు. ప్రతి పాఠశాలలో స్టాఫ్ మీటింగ్ పెట్టి ఉపాధ్యాయులకు 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించడానికి, అలాగే విద్యార్థులకు వున్న అసౌకర్యాలు తొలగించడానికి సూచనలు చేశారు. పాఠశాలలోని అన్ని గదులను పరిశీలించి ప్రధాన ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. పాఠశాలలోని ల్యాబ్, లైబ్రరీలను సక్రమంగా ఉపయోగించాలని సూచించారు. అద్దంకి మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం, గురకాయ పాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, గురకాయ పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, శంఖవరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బొమ్మనంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సందర్శించారు. వీరి వెంట చీరాల ఉప విద్యా శాఖ అధికారి డి గంగాధరరావు, అద్దంకి మండల విద్యాశాఖ అధికారి కె.వి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## విద్యార్థులు మంచి ఫలితాలను సాధించాలి - డిఇఒ సూచన



**అద్దంకి , మార్చి 6,ప్రభాతవార్త**
బాపట్ల జిల్లా విద్యాశాఖాధికారి శ్రీనివాస్, మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో ముఖ్యంగా పదవ తరగతి పిల్లలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. బోధన, పరీక్షా విధానం, పరీక్షా ఫలితాల్ని గురించి చర్చించారు. వెనుకబడిన విద్యార్థులు, పట్టుదలతో చదివి మంచి మార్కులను సాధించాలని ఆయన కోరారు. అనంతరం పాఠశాలలో ఉపాధ్యాయుల పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలల్లో సైన్స్, ల్యాబ్, మధ్యాహ్న భోజనం, పరిశుభ్రత, చిక్కి, గుడ్డు వివరాలను అన్ని ప్రధానోపాధ్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ లక్ష్యాన్ని వందశాతం నెరవేర్చే దశగా అందరూ పని చేయాలని అన్నారు. అనంతరం పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయులు చందలూరి నారాయణరావు వ్రాసిన పుస్తకాలను పరిశీలించి, పుస్తకాలు ద్వారా సాహిత్య విలువలను పిల్లలకు తెలియచేయాలని అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు గంగాధర్, కే.వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## దాతల సహకారంతో కుర్చీలు అందజేత



**పుల్లలచెరువు, మార్చి 6, ప్రభాతవార్త**
పుల్లలచెరువు మండలం ముటుకుల - 3 అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు కోర్చోవడానికి సరైన కుర్చీలు లేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితిని గమనించిన గ్రామానికి చెందిన దాతలు ముందుకు వచ్చి తమ సహకారం అందించారు. బందారు పెద్ద సాలయ్య వారి శ్రీమతి ఎల్లమ్మ చిన్నారుల సౌకర్యార్థం కుర్చీలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, స్థానిక ప్రజా ప్రతినిధులు అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారుల విద్యా పరిస్థితులను పరిశీలించారు. చిన్నారులు నేర్చుకునే వాతావరణం మెరుగుపడాలంటే అవసరమైన మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా అంగన్‌వాడీ కేంద్రంలో విద్యుత్ సౌకర్యం లేకపోవడం, అలాగే పాఠశాలకు అవసరమైన ఇతర సదుపాయాలు కొరతగా ఉండడం వంటి అంశాలను గ్రామ పెద్దలు చర్చించారు. గ్రామంలోని చిన్నారుల భవిష్యత్తు దృష్ట్యా అంగన్‌వాడీ కేంద్రానికి కావాల్సిన అన్ని మౌలిక వసతులు త్వరలోనే ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామని గ్రామ పెద్దలు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా దాతృత్వంతో ముందుకు వచ్చిన సాలయ్య, ఎల్లమ్మని గ్రామస్తులు అభినందించారు. చిన్నారుల చదువుకు ప్రోత్సాహం ఇవ్వడానికి గ్రామస్తులు ముందుకు రావడం అభినందనీయమని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త పొట్ల మల్లీశ్వరి, ఆయా గుంజి లీలావతి, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సింగరకొండను సందర్శించిన విక్రాంత్‌రెడ్డి కుటుంబం

### - ఆలయంలో ప్రత్యేక పూజలు





**అద్దంకి, మార్చి 6,ప్రభాతవార్త**
ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సింగరకొండలోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి ఆలయాన్ని రాజ్యసభ సభ్యులు వైవి సుబ్బారెడ్డి తనయుడు విక్రాంత్ రెడ్డి కుటుంబ సమేతంగా సందర్శించారు. శుక్రవారం సాయంత్రం ఆయన ఆలయాన్ని సందర్శించి కుటుంబంతో కలిసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ వేదపండితులు, పూజారులు, స్వామి వారి ఆశీర్వచనాలతోపాటు తీర్ధ ప్రసాదాలను అందజేశారు. వీరికి ఆలయం వద్ద స్థానిక వైసిపి నాయకులు ఈదా శ్రీనివాసరెడ్డి, ప్రశాంత్‌రెడ్డితోపాటు పలువురు వైసిపి నేతలు స్వాగతం పలికారు.

## అంకమ్మరావు సేవలు భావితరాలకు మరువరానివి

### - మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ రంగారావు



**అద్దంకి మార్చి 6, ప్రభాతవార్త**
విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసిన అంకమ్మరావు సేవలు భావితరానికి ఆదర్శనీయమని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ రంగారావు కొనిఆడారు. బాపట్ల మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్గా పదవీ విరమణ చేసిన, అంకమ్మరావుకు శుక్రవారం అద్దంకిలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రంగారావు మాట్లాడుతూ విధి నిర్వహణలో భావితరాలకు అంకమ్మరావు మార్గదర్శిగా మారారు అన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని తాత్కాలిక ట్రాన్స్పోర్ట్ యూనిట్ కార్యాలయంలో, ట్రాన్స్పోర్ట్ క్యాబ్ ఓనర్స్ ,డ్రైవర్స్, టూరిస్ట్ బస్సు ఓనర్స్, ఇన్సూరెన్స్ అడ్వైజర్స్ , శ్రేయోభిలాషుల ఆధ్వర్యంలో, ఈ అభినందన కార్యక్రమం కొనసాగింది. ఈ అభినందన కార్యక్రమంలోపట్టణంలోని పలువురు ప్రముఖులు అంకమ్మరావు సేవలను గుర్తు చేసుకున్నారు. సందర్భంగా ఆయన సేవలను కొనియాడుతూ ఫ్యాను వాళ్ళతో సన్మాన కార్యక్రమం కొనసాగింది, ఈ కార్యక్రమంలో మన్నం త్రిమూర్తులు, వెలనాటి శ్రీనివాసరావు, ధూళిపాళ్ళ సుబ్బారావు, కరివేను, సోమేపల్లి రాము, దస్తగిరి, లక్ష్మణ, నరేంద్ర, వీరాంజి తదితరులు పాల్గొన్నారు.

## అద్దంకి అభివృద్ధి నిధులకై పవన్ కళ్యాణ్ కలిసిన మంత్రి గొట్టిపాటి



**అద్దంకి, మార్చి 6, ప్రభాతవార్త**
అద్దంకి నియోజకవర్గ అభివృద్ధి అంశాలపై ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి పవన్ కళ్యాణ్‌ని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కలిసి చర్చించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పంచాయతీరాజ్ శాఖకు సంబంధించిన అభివృద్ధి పనులపై వివరంగా చర్చించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, తాగునీరు వంటి మౌలిక వసతుల మెరుగుదలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. అద్దంకి నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తామని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సానుకూలంగా స్పందించారు.

## అద్దంకిలో కొనసాగుతున్న విద్యార్థులకు ఉచిత సైకిళ్ల పంపిణీ

### - యువనేత గొట్టిపాటి హర్షవర్ధన్ చేతుల మీదుగా 102 మందికి సైకిళ్లు





**అద్దంకి , మార్చి 6, ప్రభాతవార్త**
అద్దంకి నియోజకవర్గంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ఉచిత సైకిళ్ల పంపిణీ కార్యక్రమం నిర్విఘ్నంగా కొనసాగుతోంది. ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అసెంబ్లీ సమావేశాల్లో నిమగ్నమై ఉండటంతో టీడీపీ యువనేత, మంత్రి గొట్టిపాటి రవికుమార్ తనయుడు హర్షవర్ధన్ సైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు. మండలంలోని ధేనువు కొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 102 విద్యార్థులకు యువనేత హర్షవర్ధన్ శుక్రవారం నాడు సెయిల్ కంపెనీ సహకారంతో సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా హర్షవర్ధన్ మాట్లాడుతూ ఇప్పటి వరకు పంపణీ చేసిన 8,500 పైగా సైకిళ్లలో సెయిల్ కంపెనీ సీఎస్ఆర్ నిధులతో 2000 సైకిళ్లను అందజేశారని హర్షం వ్యక్తం చేశారు. వేలాది మంది విద్యార్థులకు సైకిళ్లను ఉచితంగా అందించడమనే మహా క్రతువు నిర్విఘ్నంగా కొనసాగడానికి సెయిల్ వంటి అనేక కంపెనీలు, దాతల సహకారం మరువలేనిదని కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా సైకిళ్లపై పాఠశాలలకు వచ్చేప్పుడు పాఠించాల్సిన రహదారి భద్రతా నిబంధనలను విద్యార్థులకు చెప్పాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ విద్య సంవత్సరంలో పదో తరగతి చదివే విద్యార్థులందరూ మంచి మార్కులు సాధించి, ఉత్తమ ఫలితాలు సాధించాలని యువనేత హర్షవర్ధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పలువురు పాల్గొన్నారు.

## గోశాలకు రెండు గరుకు స్తంభాలు, దాణ వితరణ




**అద్దంకి , మార్చి 6,ప్రభాతవార్త**
అద్దంకి వాసవి వనిత క్లబ్ ప్రెసిడెంట్ నాగలక్ష్మి, సభ్యుల ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ ఆదేశాల మేరకు సింగరకొండలో హర హర గోకుల గోశాలలో శుక్రవారం రెండు గరుకు స్తంభాలు అందజేశారు. ఈ గరుకు స్తంభాల దాతలు చీరాల భ్రమరాంబ సేవా సమితి వాళ్లు స్పాన్సర్ చేశారు. ఆవులకి ఒక బస్తా దాన అందజేశారు. ఈ కార్యక్రమము ముందుకు నడిపించిన సింగరకొండ చైర్మన్ చుండూరు మురళి సుధాకర్‌రావు, సహాయ సహకారాలతో వనిత క్లబ్ ప్రెసిడెంట్ నాగలక్ష్మి వి.సునీత, సుజాత, జోన్ చైర్మన్ లావణ్య, అధికార పర్యటన ఆఫీసర్ ఊటుకూరు ఉమా అన్నపూం, అయిత రాజా, గ్రంధి నాగరాజ కుమారి, రమణ, వాసవి వనిత క్లబ్ సభ్యులు ఈ కార్యక్రమానికి సహాయపడిన పెద్దలందరికీ ధన్యవాదాలు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో బీజేపీ నాయకులు కిలారి శ్రీనివాసరావు మృతి

### - నివాళులర్పించిన బీజేపీ, టీడీపీ నాయకులు



**కొనకనమిట్ల, మార్చి 6, ప్రభాతవార్త**
మండలంలోని చేరెడ్డివారిపల్లె సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కిలారి శ్రీనివాసరావు(56) తీవ్ర గాయాలకు గురై మృతి చెందారు. మోటార్ సైకిల్‌పై స్వగ్రామమైన సిద్దవరం వస్తుండగా రోడ్డుపై చనిపోయి పడి ఉన్న గేదెను తగిలి కింద పడి తీవ్ర గాయాలకు గురై చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతునికి భార్య, కూతురు, కుమారుడు కలిగి ఉన్నారు. మండల బీజేపీ కన్వీనర్‌గా గతంలో పని చేశారు. జిల్లా కార్యవర్గ సభ్యులు ఉన్నారు.

### బీజేపీ నాయకులు నివాళులు :



కిలారి శ్రీనివాసరావు భౌతిక కాయాన్ని జిల్లా బీజేపీ అధ్యక్షులు సెగ్గం శ్రీనివాసరావు, మార్కాపురం నియోజకవర్గ మాజీ బీజేపీ ఇన్‌ఛార్జి పీవీ కృష్ణారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీ నారాయణ, మార్కాపురం ఏఎంసీ డైరెక్టర్ సీహెచ్ ప్రవీణ్, జిల్లా నాయకులు కల్లం సుబ్బారెడ్డి, పొదిలి, కొనకనమిట్ల మండలాల బీజేపీ కన్వీనర్లు రమణారెడ్డి, ఎం.సురేష్‌బాబు, టీడీపీ మాజీ మండల కన్వీనర్ తాతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు ఏలూరి రామచంద్రారెడ్డి, నాయకులు బొంతయ్య, వల్లూరి బ్రహ్మయ్య, వీఆర్వో కిలారి సుబ్బారావు, పలువురు నాయకులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

